


పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేశ్



అనకాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంట్ సెక్రటేరియట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్లమెంట్ ... మిగతా 8వ పేజీలో

గోవాడను గట్టెక్కిస్తారా!

పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో షుగర్ ఫ్యాక్టరీ

- ఆప్కాబ్‌కు రూ.40 కోట్ల మేర రుణ బకాయిలు
- చెరకు రైతులకు పూర్తిగా అందని డబ్బులు
- ఇంకా రూ.7 కోట్లకు పైగా బకాయిలు
- కార్మికులకు రూ.2 కోట్లు...
- ఫ్యాక్టరీలో ఓవర్ హాలింగ్ పనులకు రూ.5 కోట్లు అవసరం
- రూ.15 కోట్లు ఉంటేనే వచ్చే క్రషింగ్ సీజన్ ఆరంభం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- నేడు గోవాడ షుగర్స్ మహాజన సభ



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, సెప్టెంబరు27: ఒకప్పుడు రాష్ట్రంలోని సహకార చక్కెర కర్మాగారాల్లో అగ్రగామిగా వెలుగొందిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. గత ఐదేళ్ల నుంచి ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ జరుగుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తం అవుతున్నది. గత సీజన్‌లో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదు. కార్మికులకు వేతన బకాయిలు వున్నాయి. పీకల్లో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన గోవాడ ఫ్యాక్టరీకి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహకారంతో పాటు, ఫ్యాక్టరీ మనుగడ సాగించే దిశగా తగిన భరోసా కోసం ఇటు చెరకు రైతులు, అటు కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, చెరకు రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఇప్పటికే హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శనివారం తొలి మహాజన సభను నిర్వహిస్తుండడంతో చెరకు బకాయిలు, కార్మికుల వేతన బకాయిల చెల్లింపుతోపాటు, ఫ్యాక్టరీ నిర్వహణపై ప్రజాప్రతినిధులు ఎటువంటి భరోసా ఇస్తారన్న దానిపై చర్చసాగుతున్నది.

మనుగడ కోసం పోరాటం

గోవాడ షుగర్ ఫ్యాక్టరలో ఒకప్పుడు ఐదు లక్షల టన్నులకుపైగా చెరకు క్రషింగ్ నిర్వహించారు. వివిధ కారణాల వల్ల చెరకు క్రషింగ్ ఏటేటా తగ్గుతున్నది. 2019లో మూడు లక్షల 75 వేల టన్నులు, 2020లో రెండు లక్షల 91 వేల టన్నులు, 2022లో రెండు లక్షల 21 వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయగా, గత సీజన్‌లో లక్షా 70 వేల 601 టన్నులు మాత్రమే క్రషింగ్ నిర్వహించింది. ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో పలువురు రైతులు చెరకు సాగుకు స్వస్తి పలుకుతున్నారు.

దీంతో ఈ ఏడాది ఫ్యాక్టరీకి లక్ష టన్నుల చెరకు సరఫరా అయితే గొప్ప విషయం అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల వల్ల రైతులకు ఎరువులు, దవ్వ సరఫరా సక్రమంగా జరగడంలేదు. క్రిమి సంహారక మందుల సరఫరా అంతంత మాత్రంగానే వుంది.

అప్పుల భారం.. చెల్లింపుల్లో జాప్యం

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సుమారు రూ.40 కోట్ల మేర ఆప్కాబ్‌కు రుణ బకాయిలు వుంది. ఆప్కాబ్ నుంచి అప్పు పుట్టే పరిస్థితి లేకపోవడంతో గత రెండు సీజన్‌ల నుంచి కేవలం పంచదార విక్రయాల ద్వారా వచ్చిన డబ్బులను చెరకు రైతులకు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదు. టన్నుకు రూ.2,919 చొప్పున ఇవ్వాల్సి వుండగా, ఇంతవరకు రూ.2,500 చొప్పున మాత్రమే చెల్లించారు. టన్నుకు రూ.419 చొప్పున ఇంకా రూ.7.14 కోట్లు రైతులకు అందాల్సి వుంది. ఈ బకాయిలకు తోడు రవాణా ఛార్జీలు మరో కోటి రూపాయల వరకు ఉన్నాయి. ఈ ఏడాది కార్మికులకు వేతనాలతోపాటు, పదవీ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీ, ఇతర అరియర్స్ చెల్లించలేదు. రైతులకు, కార్మికులకు కలిపి రూ.10 కోట్లకుపైనా బకాయిలు వున్నాయి. రానున్న సీజన్ కోసం ఫ్యాక్టరీలో ఓవర్‌హాలింగ్ పనులు చేయాలి. వీటికి రూ.5 కోట్ల వరకు అవసరం. ఈ ఏడాది క్రషింగ్‌ను ప్రారంభించాలంటే దాదాపు రూ.15 కోట్లు అవసరం అవుతాయని ఫ్యాక్టరీ అధికారులు చెబుతున్నారు.

వాస్తవానికి పంచదారపైనే ఆధారపడితే గోవాడ ఫ్యాక్టరీ మనుగడ సాగించడం కష్టం. ఆర్థిక వనరులు పెంచుకోవడానికి ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చాలాకాలంగా వినిపిస్తున్నది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు గత వైసీపీ ప్రభుత్వం కొంతమేర నిధులు కేటాయించి.. రోజుల వ్యవధిలోని తిరిగి వెనక్కు తీసుకుంది. గత ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపై విస్పష్ట ప్రకటన రావడంతోపాటు షుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు, షుగర్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం నుంచి సహకారంపై కూటమి నేతలు, చెరకు రైతుల్లో భరోసా కల్పించాల్సిన అవసరం వుంది. ఇదే సమయంలో చెరకు సాగు విస్తీర్ణం పెంచడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. శనివారం జరగనున్న షుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలో కూటమి ప్రజాప్రతినిధులు స్పష్టమైన హామీలు ఇస్తారని చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఇసుక కొరత!

వర్షాలు, నదుల్లో వరదతో తవ్వకాలు నిలిపివేత

- ఇసుక నిల్వలు లేనట్టు ఆన్‌లైన్ పోర్టల్‌లో దర్శనం
- ఇసుకకు పెరిగిన డిమాండ్
- జిల్లాలోని నదుల్లో అక్రమంగా తవ్వకాలు
- టైరు బండి ఇసుక రూ.1,200-1,500
- ట్రాక్టర్ అయితే రూ.6-9 వేలు!



కె.కోటపాడు మండలం చౌడువాడలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భవన నిర్మాణాలు, ఇతర కట్టడాల పనులకు ఇసుక లభించని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఎక్కడా అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోవడం, ప్రభుత్వం ఇసుక డిపోలను ఎత్తివేయడంతో ఇసుక కొరత ఏర్పడింది. నర్సీపట్నం డిపోలో సుమారు 40 వేల టన్నుల ఇసుక ఉన్నప్పటికీ, పర్యావరణ అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపారంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేయడంతో ఇసుక అమ్మకాలు ఆపేశారు. మరోవైపు అటు గోదావరి, ఇటు వంశధార, నాగావళి నదుల్లో వరద ఉధృతి కొనసాగుతుండడంతో ఇసుక తవ్వకాలకు వీలు కావడంలేదు. ఇదే అదనుగా భావించిన కొంతమంది అక్రమార్కులు, జిల్లాలోని నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రిపూట ట్రాక్టర్లు, లారీల్లో లోడింగ్ చేసి పట్టణ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, అచ్యుతాపురం, నక్కపల్లిల్లో ఇసుక డిపోలు ఉండేవి. వైసీపీ హయాంలో ఆయా డిపోల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనకాపల్లి, చోడవరం అచ్యుతాపురం ఇసుక డిపోలను అధికారులు మూసేశారు. నర్సీపట్నం, నక్కపల్లి డిపోల్లో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే నర్సీపట్నం డిపోలో ఇసుక నిల్వల్లో తేడాలు ఉన్నాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేయడంతో అధికారులు అమ్మకాలు నిలిపేశారు. ప్రభుత్వం ఈనెల 19న ప్రారంభించిన ఉచిత ఇసుక పాలసీ నాటికి నక్కపల్లి డిపోలో సుమారు 17 వేల టన్నుల వుంది. ఇది ఆన్‌లైన్‌లో ఒక్క రోజులోనే అమ్ముడుపోయినట్టు గనుల శాఖ అధికారులు చెబుతున్నారు.

భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను రవాణా చార్జీలు మాత్రమే తీసుకుని, ఉచితంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని గనులు, రవాణా శాఖల ఉమ్మడి ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. అయితే సుమారు నెల రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో అనకాపల్లి జిల్లా అవసరాలకు ఇసుకను రప్పించే గోదావరి నదిలో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో ఇసుక తవ్వకాలు నిలిపేవారు. దీంతో ఉచిత ఇసుక ఆన్‌లైన్ పోర్టల్‌లో ఇసుక నిల్వలు ఉన్నట్టు చూపడం లేదు. ఫలితంగా భవన నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. ఇసుక ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న దానిపై అధికారులకు కూడా స్పష్టత ఇవ్వడం లేదు.

నదుల్లో అక్రమ తవ్వకాలు

జిల్లాలో ఇసుక కొరతను ఆసరాగా చేసుకున్న కొంతమంది అక్రమార్కులు నదుల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. నదుల్లో టైర్ బండ్లతో ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును వీరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పగటిపూట నదుల్లో నుంచి టైరు బండ్లతో ఇసుకను బయటకు తీసుకువచ్చి, సమీపంలోని తోటలు, ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రిపూట ట్రాక్టర్లు, లారీలతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల వరకు టైరు బండి ఇసుక రూ.900లకు లభించేంది. ఇప్పుడు రూ.1200లకు అమ్ముతున్నారు. ట్రాక్టర్ ఇసుక దూరాన్నిబట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేలకు దొరికేది. ఇప్పుడు రూ.7 వేల నుంచి రూ.9 వేలకు అమ్ముతున్నారు.

నర్సీపట్నం సమీపంలోని బలిఘట్టం, దుగ్గాడ ప్రాంతాల్లో వరహా నదిలో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల వరహా, సర్పా నదుల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడ టైరు బండి ఇసుక దూరాన్నిబట్టి రూ.1200 నుంచి రూ.1500లు వుంది. ట్రాక్టర్ ఇసుక అయితే రూ.6 వేలకు అమ్ముతున్నారు.

అనకాపల్లి మండలం తగరంపూడి, వెంకుపాలెం వద్ద శారదా నదిలో ఏడాదిపాటు ఇసుక తవ్వకాల కోసం ... మిగతా 8వ పేజీలో

దేవదాయ శాఖ జిల్లా అధికారి బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన సుధారాణి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27: అనకాపల్లి జిల్లా దేవదాయ శాఖ అధికారి (అసిస్టెంట్ కమిషనర్)గా సుధా రాణి శుక్రవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇటీవల అనకాపల్లి ఏసీగా పనిచేసి కొద్ది రోజుల క్రితం బదిలీ అయ్యారు. అయితే మూడు రోజుల క్రితం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆమెను తిరిగి అనకాపల్లి జిల్లాకు ఏసీగా నియమించారు. ఈ మధ్య కాలంలో రాజారావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

పెరిగిన పీజీ ప్రవేశాలు

ఉమ్మడి జిల్లాలో 32 కళాశాలల్లో 4,958 సీట్లు

- తొలి దశలో 45.7 శాతం మేర భర్తీ
- గత ఏడాది కంటే చాలా మెరుగంటున్న కాలేజీల నిర్వాహకులు
- ఖాళీగా మరో 2,692 సీట్లు
- నేడు రెండో దశ సీట్లు అలాట్‌మెంట్

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో తొలి దశ ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో పీజీలో చేరే విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. ప్రైవేటు కాలేజీల్లో పీజీ చదివే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయడమే అందుకు ప్రధాన కారణం. అదే సమయంలో అడ్మిషన్స్ ప్రక్రియను ఆలస్యం చేయడం వల్ల కూడా సీట్లు భారీగా మిగిలిపోతుండేవి. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లడంతో ఈ ఏడాది వేగంగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. తొలి దశ అడ్మిషన్స్ ప్రక్రియను గత నెల ఐదో తేదీన ప్రారంభించి, ఈ నెల పదో నాటికి పూర్తిచేసేలా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నిర్ణయమే తొలి దశలో 40 శాతానికిపైగా సీట్లు భర్తీ అయ్యేందుకు కారణమైందని కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. తొలి దశలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 45.7 శాతం మేర సీట్లు భర్తీ అయినట్టు అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో పీజీ కోర్సులు నిర్వహించే కాలేజీలు 32 ఉన్నాయి. వీటిలో సుమారు 50కిపైగా కోర్సుల్లో 4,958 సీట్లు ఉన్నాయి. తొలి దశలో 2,266 సీట్లు (45.7 శాతం) భర్తీ అయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే మూడు నుంచి నాలుగు శాతం మేర ఎక్కువ సీట్లు భర్తీ అయినట్టు చెబుతున్నారు. లైఫ్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, ఇంగ్లీష్ కోర్సుల్లో ఎక్కువ మంది చేరారంటున్నారు. కాగా, మరో 2,692 (54.29 శాతం) సీట్లు ... మిగతా 8వ పేజీలో

ముంపులో జగనన్న కాలనీలు

లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు వేసిన నాటి పాలకులు

- కానరాని పక్కారోడ్లు, డ్రైనేజీ కాలువలు
- వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్న కాలనీలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నివాసితులు



జానకయ్యపేటలో చెరువును తలపిస్తున్న ఇళ్ల కాలనీ



నక్కపల్లి మండలం జానకయ్యపేటలో జగనన్న కాలనీని ముంచెత్తిన వరద

నక్కపల్లి, సెప్టెంబరు 27: మండలంలో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. నాలుగు గంటల్లో 87.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జానకయ్యపేట గ్రామానికి సమీపంలోని జగనన్న ఇళ్ల కాలనీ నీట మునిగింది. వైసీపీ హయాంలో పెదబోదిగల్లం, నక్కపల్లి, ఉపమాక, జానకయ్యపేట, అయ్యన్నపాలెం పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయితే గతంలో ఈ ప్రాంతం అంతా లోతట్టు పంట భూములు కావడంతో వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నది. శుక్రవారం ఉదయం భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటమునిగాయి. దీంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల, సెప్టెంబరు 27: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కోటవురట్లలోని జగనన్నకాలనీ బురదమయంగా మారింది. దీంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. మెయిన్‌రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం ... మిగతా 8వ పేజీలో



ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షం నీరు

ముసురు!

- జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం

అనకాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దఫదఫాలుగా వర్షం కురిసింది. రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. అత్యధికంగా నక్కపల్లి మండలంలో 87.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రాంబిల్లి మండలంలో 55.4 మి.మీ.లు, ఎస్.రాయవరంలో 42.8, ఎలమంచిలిలో 38.8, కశింకోటలో 28.2, పరవాడలో 25, మునగపాకలో 17, కోటపాడులో 16.8, అనకాపల్లిలో 16.2, సబ్బవరంలో 16, అచ్యుతాపురంలో 15.6, కె.కోటపాడులో 15.4, మాడుగులలో 15.2, నాతవరంలో 14.2, రావికమతంలో 13.6, మాకవరపాలెంలో 12.4, నర్సీపట్నంలో 10.2, చోడవరంలో 10, గొలుగొండలో 9, రోలుగుంటలో 6.2, చీడికాడలో 6.2, బుచ్చెయ్యపేటలో 4.8, పాయకరావుపేటలో 3.4, దేవరాపల్లిలో 2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

గతుకుల రోడ్డులో ఊడిన బస్సు టైర్లు

ఎం.కోటపాడు సమీపంలో భారీ గొయ్యి వద్ద సంఘటన

- ఉలిక్కిపడిన ప్రయాణికులు
- బస్సు వేగాన్ని నియంత్రించి, ప్రమాదాన్ని తప్పించిన డ్రైవర్

మాడుగుల రూరల్, సెప్టెంబరు 27: వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బి రహదారిపై అనకాపల్లి జిల్లా మాడుగుల మండల పరిధిలో పలుచోట్ల ఏర్పడిన భారీ గోతులతో వాహనాలు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాల బారినపడుతున్నాయి. ఎం.కోటపాడు సమీపంలో ఓ పెద్ద గొయ్యి వద్ద శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సు వెనుక టైరు ఊడిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. టైరు ఊడిన వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వేగాన్ని నియంత్రించి, కొద్ది దూరంలో బస్సును ఆపారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అనకాపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ30జడ్ 0036 నంబరు గల పల్లె వెలుగు బస్సు శుక్రవారం మాడుగుల వచ్చేందుకు ఉదయం 9.10 గంటలకు అనకాపల్లిలో బయలుదేరింది. చోడవరం, వడ్డాది మీదుగా 10.30 గంటల ... మిగతా 8వ పేజీలో



ఆర్టీసీ బస్సు టైర్లు ఊడిపోయింది ఈ గొయ్యి వద్దే...



ఊడిపోయిన బస్సు టైర్లు

క్రైం... crime news

సినిమా థియేటర్ సిబ్బందిపై దాడి

▸ దేవర సినిమా బెనిఫిట్ షో టికెట్ ఇవ్వలేదని ఆగ్రహం



గాయపడిన థియేటర్ ఆపరేటర్ రవికుమార్

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 27: జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా బెనిఫిట్ షో టికెట్ ఇవ్వలేదని థియేటర్ సిబ్బందిపై దాడి చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల కోసం 'దేవర' సినిమాను స్థానిక ఎస్‌బీటీఎల్‌లోని రెండు స్ర్కీన్‌లపై గురువారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అయితే టికెట్లు లభించని పూడిమడకకు చెందిన ఇద్దరు యువకులు, సినిమాహాలు గేటు దూకి లోపలికి వెళ్లి ఆపరేటర్ రవికుమార్, సెక్యూరిటీ గార్డు జి.ఈశ్వరరావులపై దాడి చేశారు. ఈ సమయంలో పోలీసులు లేకపోవడంతో సినిమా చూడడానికి వచ్చిన వారిలో కొందరు జోక్యం చేసుకుని, దాడి చేసిన యువకులను నిలువరించారు. అయితే అప్పటికే రవికుమార్ తల, చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. పూడిమడకకు చెందిన ఒక నాయకుడు ఉద్దేశపూర్వకంగానే తమపై దాడి చేయించాడని థియేటర్ మేనేజర్ కొండబాబు ఆరోపించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

శ్రీవారి లడ్డూ అపవిత్రంపై 'సుందరపు' దీక్ష



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్ష చేపడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 27: వైసీపీ పాలకులు తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించి, అపవిత్రం చేశారంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న దీక్షకు మద్దతుగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం ఇక్కడ దీక్షకు దిగారు. అచ్యుతాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం తన అనుచరులతో కలిసి దీక్ష చేపట్టారు. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడానికి కారకులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు లాలం భవానీ, బైలపూడి రామదాసు, లాలం చందు, ద్వారపురెడ్డి బాబ్జీ, మోటూరు త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్టేట్ ఫుడ్ లేబొరేటరీ!

▸ ప్రధాని ప్రారంభించి నెలలు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురాని అధికారులు
▸ ప్రైవేటు ల్యాబ్‌లకు నమూనాలు...
▸ ఒక్కొక్క టెస్ట్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేల చెల్లింపు
▸ ల్యాబ్‌ల నుంచి భారీగా కమీషన్లు
▸ అందుకే ప్రభుత్వ ల్యాబ్‌లో కార్యకలాపాలు ప్రారంభించలేదనే విమర్శలు
▸ తిరుపతిలో కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగుచూడడంతో చర్చలోకి స్టేట్ ఫుడ్ ల్యాబ్



ల్యాబ్ కోసం విశాఖలో నిర్మించిన భవనం

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యి కలుషితమైందంటూ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) రిపోర్టు ఇచ్చింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టెస్టింగ్ ల్యాబ్స్ గురించి ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ప్రతి రాష్ట్రంలోనూ ఈ తరహా ల్యాబ్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు దేవాలయాలు, ఇతర ప్రముఖ స్థలాల్లో అందించే ప్రసాదాలు నాణ్యతను కాపాడేందుకు అవకాశం ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్టేట్ ఫుడ్ లేబొరేటరీలను మంజూరుచేస్తుంటుంది. రాష్ట్ర విభజన తరువాత ల్యాబ్ హైదరాబాద్‌లో ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు మరో ల్యాబ్‌ను మంజూరుచేసింది. ఇందుకోసం రూ.30 కోట్లు కేటాయించింది. విశాఖ నగరంలోని పెదవాల్తేరులో గల ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ల్యాబ్ ఏర్పాటుకోసం రూ.15 కోట్లతో భవనం నిర్మించారు. భవనం పూర్తికావడంతో పాటు మరో రూ.15 కోట్ల రూపాయలు విలువజేసే పలు పరికరాలను కేంద్రం ప్రభుత్వం అందించింది. మరికొంత ల్యాబ్ నిర్వహణ కోసం కేటాయించినట్టు చెబుతున్నారు. ఈ ల్యాబ్‌ను ఆరు నెలల కిందట ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే ఇప్పటికీ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. అందుకు ఉన్నతాధికారులే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ల్యాబ్ నిర్వహణ కోసం టెక్నీషియన్లు, అటెండర్స్, జూనియర్ అనలిస్టులు, సీనియర్ అసిస్టెంట్ వంటి పోస్టులను భర్తీచేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను కూడా అధికారులు ఇప్పటివరకూ ప్రారంభించలేదు.

కమిషన్ల కక్కుర్తితోనే..

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీని నియంత్రించేందుకు రాష్ట్రస్థాయిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ పనిచేస్తోంది. ఈ డిపార్టుమెంట్ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరిస్తుంది. ఆ నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించాలి. అలాగే రాష్ట్రస్థాయిలో ఎప్పటికప్పుడు నమూనాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సేకరిస్తుంటారు. ఈ నమూనాలను సాధారణంగా ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఉన్న ల్యాబ్‌కు పంపించి తనిఖీలు చేయిస్తుండేవారు. అందుకు అయ్యే ఖర్చు తక్కువగా ఉండేది. కానీ, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో పనిచేసే ఒకరిద్దరు అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరుతో సేకరించిన నమూనాలను హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లోని ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. ఆయా ల్యాబ్‌లు ఒక్కో టెస్ట్‌కు కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. ఈ మొత్తాన్ని ల్యాబ్ నిర్వహణకు కేంద్రం మంజూరుచేసిన నిధుల నుంచి చెల్లిస్తున్నారు. అందుకుగాను అధికారులకు సదరు ల్యాబ్‌ల నిర్వాహకుల నుంచి భారీగా కమీషన్లు అందుతున్నట్టు చెబుతున్నారు. ఈ కమీషన్లకు కక్కుర్తిపడే ఉన్నతాధికారులు విశాఖలో ప్రారంభమైన స్టేట్ ఫుడ్ లేబొరేటరీని అందుబాటులోకి రాకుండా చేస్తున్నారని చెబుతున్నారు.

రూ.కోట్లు విలువజేసే పరికరాలు..

స్టేట్ ఫుడ్ లేబొరేటరీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దేవస్థానాల్లో లడ్డూ, పులిహోర, ఇతర ప్రసాదాలు తయారీకి వినియోగించే ఉత్పత్తులు (నెయ్యి వంటివి) కూడా తనిఖీ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఆయిల్స్, బిస్కెట్స్, ఫుడ్ పాయిజనింగ్‌కు కారణాలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్ సేకరించే నమూనాలు, ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ మెటీరియల్స్ నమూనాలను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలోని దేవాలయాల్లో తయారుచేసే ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి, ఆయిల్స్, ఇతర పిండి పదార్థాలు నాణ్యతను పరీక్షించే ఆధునాతన పరికరాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ ల్యాబ్‌లో మైక్రో బయాలజీ, కెమికల్ అనాలసిస్‌ను నిర్వహించనున్నారు. ఈ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఎన్‌డీడీబీ వంటి ల్యాబ్‌లకు వెళ్లాల్సిన అవసరం లేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి అందుబాటులోకి తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

వామ్మో... రేబిస్!

పెంపుడు కుక్కలతో జర జాగ్రత్త




▸ అనునిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే
▸ ప్రతి ఏటా టీకా వేయించడం తప్పనిసరి
▸ కరిస్తే వెంటనే వైద్యులను సంప్రతించాలి

ఈ ఏడాది థీమ్ బ్రేకింగ్ రేబిస్ బౌండరీస్

▸ నేడు ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం

పెంపుడు జంతువులపై ప్రేమ కొన్నిసార్లు ప్రాణాల మీదకు తేవచ్చు. ఇటీవల భీమిలిలో జరిగిన సంఘటన దీనిని స్పష్టం చేసింది. పెంపుడు కుక్క కాటుకు గురై తండ్రీకుమారులు మృత్యువాత పడ్డారు. తమ కుక్కే కదా అనే ధీమా... చిన్న గాయమనే నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కుక్కలు, ఇతర పెంపుడు జంతువుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. నేడు ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం సందర్భంగా కథనం..



కూర్మన్నపాలెం/ నర్సీపట్నం/ విశాఖపట్నం, సెప్టెంబరు 27:

జంతువులను సాకడం మానవ మనుగడలో భాగం. జీవనోపాధికి పశువులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, కోళ్లు, పందుల పెంపకం అవసరం. అయితే వీటి ద్వారా సంక్రమించే జూనోసిస్ వ్యాధులపై అవగాహన లేకుంటే ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. ఇందులో ప్రధానమైనది రాబిస్. ఇది ఎక్కువగా కుక్కల నుంచి సంక్రమిస్తుంది. అత్యంత ప్రమాదకరమైన వైరస్. శతశాతం ప్రాణహాని కలిగించే వ్యాధిని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్ధారించింది. కుక్కల పట్ల అమిత ప్రేమ చూపించే అమెరికాలో ఏడాదికి 40 వేల మంది రేబిస్ వ్యాధికి గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

ఈ ఏడాది థీమ్.. బ్రేకింగ్ రేబిస్

ఈ ఏడాది బ్రేకింగ్ రేబిస్ 2024 (రేబిస్ సరిహద్దులను బద్దలు కొడదాం) థీమ్‌తో ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రేబిస్‌కు టీకాను కనుగొన్న ప్రఖ్యాత మైక్రో బయోలజిస్ట్ లూయిపాశ్చర్ వర్ధంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 28న ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం నిర్వహిస్తున్నాం. ఈవ్యాధి సుమారు 148 దేశాల్లో ఉందని అంచనా. మన దేశంలోనే సుమారు 39 మిలియన్ల వీధి కుక్కలున్నాయని, ఏటా సుమారు 19వేల మంది కుక్క కాటుతో మృతి చెందుతున్నారని సర్వేలు చెబుతున్నాయి.

రేబిస్ లక్షణాలివి...

రేబిస్ సోకిన వారిలో తీవ్ర జ్వరం, తలనొప్పి, గందరగోళం, ఉద్రేకం, అన్యమనస్కంగా ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రేబిస్ సోకిన కుక్క నాలుకను బయటకు చాపి చొంగకారుస్తుంది. మతిస్థిమితం కోల్పోయి వీధుల వెంట పరుగెడుతుంది. యజమానిని కూడా గుర్తు పట్టలేని స్థితికి చేరుతుంది. కనిపించిన ప్రతి వస్తువునూ కరిచేందుకు ప్రయత్నిస్తుంది. తూలుతూ, తడబడుతూ మద్యం మత్తులో ఉన్నట్టు తోకను సైతం ఆడించలేదు. అరుపులో మార్పు, నీటిని చూసి భయపడడం, డొక్కలు ఎండిపోయి, ఊపిరి పీల్చుకోలేక వారం పది రోజుల వ్యవధిలో మృతి చెందుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

- కుక్క కాటుకు గురై వెంటనే గాయాన్ని సబ్బునీరు లేదా మంచినీటితో నిర్విరామంగా 15 నిమిషాలు శుభ్రం చేయాలి.
- గాయంపై ఆయింట్‌మెంట్లు పూయకూడదు. కుట్లు, కట్లు కట్టకూడదు.
- వీలైనంత త్వరగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. 0, 3, 7, 14, 28, 90 రోజుల్లో కోర్సు వెయించుకోవాలి.
- గాయాలు ఎక్కువగా ఉంటే ఏఆర్‌వీతో పాటు ఇమ్యునోగ్లోబలిన్స్ ఇంజక్షన్ తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు.
- కుక్క కరిస్తేనే రేబిస్ సోకుతుందని అందరూ భావిస్తారు.. కానీ గోర్లతో గీకినా, నాలుకతో తాకినా వ్యాధి సోకే ప్రమాదం ఉంది.
- రేబిస్ సోకిన వ్యక్తి నుంచి ఇతరులకు కూడా ప్రబలే ప్రమాదం ఉంది. కుక్క కాటుతో బాధపడుతున్న వారితో అప్రమత్తంగా మెలగాలి. ఈ వ్యక్తి కరిచినా, గీకినా రేబిస్ వ్యాపిస్తుంది.

ఇవీ లెక్కలు..

విశాఖ జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో కుక్క కాటు కేసులు భారీగా నమోదయ్యాయి. నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను కాటేస్తున్నాయి. కుక్క కాటుకు గురైన ప్రతిదీ రేబిస్ కాదు. ఈ వైరస్ ఉన్న కుక్కలు కరిచిన మూడు రోజుల్లో వ్యాక్సిన్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇయర్	డాగ్ బైట్ కేసులు	రేబిస్ కేసులు	మరణాలు
2021	18,324	0	0
2022	24,387	73	0
2023	28,028	179	0
2024	21,462	64	0

జంతువుల నుంచి 190 రకాల వ్యాధులు

జంతువుల నుంచి మనిషికి, మనిషి నుంచి జంతువులకు 190 రకాల వ్యాదులు సోకే ప్రమాదం ఉందని పశు సంవర్థక శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూతో పాటు రేబిస్, టీబీ, జపనీస్ ఎన్ సఫలైజేషన్ (మెదడు వాపు) తదితర వ్యాదులు సంక్రమిస్తాయి. పిల్లులు, గబ్బిలాలు, ముంగిసలు గీచినా రేబిస్ వస్తుంది. పందులతో జపనీస్‌ఎన్‌సఫలైజేషన్, పశువులు, గొర్రెలతో టీబీ సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఒక్కటే మార్గమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నిర్లక్ష్యంతో ప్రమాదం



కుక్క కాటును నిర్లక్ష్యం చేస్తే ప్రమాదానికి దారి తీయవచ్చు. అన్ని కుక్కల్లోనూ రేబిస్ వైరస్ ఉండకపోవచ్చు. కానీ, రేబిస్ వైరస్ ఉన్న కుక్క కరిస్తే ప్రమాదకరం. మూడు రోజుల్లో వ్యాక్సిన్ తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలు పోతాయి. వ్యాక్సిన్ ద్వారా శరీరంలోకి యాంటీబాడీస్ వెళ్లి రేబిస్ వైరస్‌ను నాశనం చేస్తాయి. పెంపుడు కుక్కలకు ఎప్పటికప్పుడు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలి. హాస్పిటల్‌లో ప్రతిరోజూ 20 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ అందిస్తుంటాం. - **డాక్టర్ కె.బసవారెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్‌వీవీయూ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్

రిజర్వాయర్లకు జలకళ

▸ గరిష్ఠ స్థాయికి నీటి మట్టాలు

రావికమతం, సెప్టెంబరు 27:

జిల్లాలో ప్రధాన జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో రిజర్వాయర్లు తొణికిసలాడుతున్నాయి. ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడిచిపెడుతున్నారు. కల్యాణపులోవ, పెద్దేరు, కోనాం జలాశయాల్లో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. రావికమతం మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడిచి పెడుతున్నట్టు ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా, శుక్రవారం నాటికి 458.80 అడుగులకు చేరింది. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు ఏఈ తెలిపారు.



పెద్దేరు జలాశయం



కల్యాణపులోవ వద్ద ఎత్తిన రెండు గేట్లు

పెద్దేరు..

మాడుగుల రూరల్: మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువైంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.30 మీటర్లకు చేరింది. జలాశయం పరిసరాల్లో తేలికపాటి వర్షం పడుతున్నదని, కేవలం కుడి, ఎడమ కాలువలకు 120 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ సుదాకర్ రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పరిస్థితిని బట్టి జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడిచిపెడతామని చెప్పారు.

కోనాం..

చీడికాడ: మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 100 మీటర్లకు చేరుకుంది. గరిష్ఠ సామర్థ్యం 101.25 మీటర్లు కాగా, ఎగువ ప్రాంతాల నుంచి 180 క్యూసెక్కుల వరదనీరు జలాశయంలోకి వస్తోంది. ఎగువ, దిగువ కాలువలతో పాటు మెయిన్ గేట్లు ద్వారా అదే స్థాయిలో సాగునీటిని విడుదల చేస్తున్నట్టు ఏఈ జయరాం పడాల్ తెలిపారు.

రైవాడ

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా శుక్రవారం సాయంత్రానికి 113.5 మీటర్లకు చేరింది. జలాశయంలోకి 800 క్యూసెక్కులు వరద నీరు జలాశయంలోకి చేరుతుంది. విశాఖ నగర పాలక సంస్థ తాగు నీటి అవసరాలకు 50 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, కుడి కాలువ 25 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద నీరు అధికంగా చేరి 113.5 మీటర్లకు దాటితే.. నీటిని ఏసమయంలోనైనా విడుదల చేస్తామని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.



గరిష్ఠ స్థాయికి చేరిన రైవాడ జలాశయం

పీసీపీఐఆర్‌కు యాంకర్ ప్రాజెక్టు

▸ ముంబై ఇండియా కెమ్-2024 సదస్సు వేదికగా ప్రయత్నిస్తాం
▸ ప్రైవేటు సంస్థలనైనా ఆహ్వానించడానికి సిద్ధం
▸ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్



యువరాజ్

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని పెట్రో కెమికల్ పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)కు యాంకర్ ప్రాజెక్టును తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. అక్టోబరులో ముంబైలో జరగనున్న ఇండియా కెమ్-2024 అవగాహన సదస్సులో పాల్గొనడానికి విశాఖపట్నం వచ్చిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పదిహేనేళ్ల క్రితమే దేశంలో గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు పీసీపీఐఆర్‌లను మంజూరుచేశారని గుర్తుచేశారు. అయితే ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు యాంకర్ ప్రాజెక్టులు లేకపోవడం వల్ల అవి టేకాఫ్ కాలేకపోయాయన్నారు. విశాఖపట్నం కేంద్రంగా తుని వరకు 625 చ.కి.మీ. విస్తీర్ణంలో పీసీపీఐఆర్‌ను నోటిపై చేశారని, ఆయా ప్రాంతాల్లో ఫార్మా ఆర్థిక మండళ్లు, రసాయన పరిశ్రమలు అనేకం వచ్చాయన్నారు. అయితే అత్యంత కీలకమైన యాంకర్ ప్రాజెక్టు లేదన్నారు. గత జూలై నెలలో ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు చెప్పి ప్రభుత్వ లేదా ప్రైవేటు యాంకర్ ప్రాజెక్టు మంజూరు చేయాలని కోరారని వివరించారు. ముంబైలో కెమికల్స్, పెట్రో కెమికల్స్‌పై మూడు రోజుల సదస్సు జరుగుతుందని, అక్కడకు అన్ని రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల నుంచి కూడా ప్రతినిధులు వస్తారని, వారికి ఇక్కడి పరిస్థితులు వివరించి, ల్యాండ్ బ్యాంకు చూపించి యాంకర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుతం పెట్రోలియం కంపెనీలు క్రాకర్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాయని, అలాంటిదేమైనా వస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గతంలో హెచ్‌పీసీఎల్ యాంకర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ముందుకువచ్చి ఆ తరువాత వెనక్కి తగ్గిందన్నారు. ఈసారి ప్రైవేటు సంస్థలనైనా ఆహ్వానించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

జల వనరుల శాఖలో బదిలీలు

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో డీఈ, ఏఈ కేడర్‌లో పలువురిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖపట్నం హెడ్‌క్వార్టర్స్ డీఈ పి.చరణ్‌ను విజయనగరం జిల్లా ఎస్.కోట బదిలీ చేసి, ఆయన స్థానంలో నర్సీపట్నం డీఈ జె.స్వామినాయుడును నియమించారు. విశాఖ సర్కిల్ కార్యాలయంలో డీఈ పి.హరిప్రసాద్‌ను అనకాపల్లి జిల్లా ఎలమంచిలి సమీపాన గల అడ్డరోడ్డులో ఉన్న పోలవరం కాలువ పీఏపీఎల్ఎం డివిజన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం సర్కిల్‌లో ఉన్న శ్రీహరికి పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సర్కిల్ కార్యాలయం పరిధిలో ఐదేళ్ల సర్వీస్ దాటిన ఏఈలను బదిలీ చేశారు.

నూకాంబిక ఆలయ ఇన్‌చార్జి ఈవోగా సుజాత బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన సుజాత

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ విశాఖ జిల్లా ఏసీగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో డీసీ సుజాతను ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. జిల్లా దేవదాయ శాఖ అధికారి సుధారాణి, పలువురు ఈవోలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

30న ఉద్యోగ మేళా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27: అనకాపల్లి మండలం రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని, 18 నుంచి 30 ఏళ్ల వయసు గల యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉదయం తొమ్మిది గంటలకు పాలిటెక్నిక్ కళాశాలకు రావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 81432 29228 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

సముద్రంలోకి ఫార్మా వ్యర్థాలతో మత్స్య సంపదకు ముప్పు



పూడిమడక సముద్రతీరం వద్ద కొట్టుకు వచ్చిన చేపలను పరిశీలిస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 27: ఫార్మా కంపెనీల నుంచి వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచి పెట్టడంతో మత్స్యసంపదకు ముప్పు వాటిల్లుతున్నదని పూడిమడక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పూడిమడక తీరం వద్దకు కొట్టుకుని వచ్చిన మృత చేపలను వారు పరిశీలించారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేయడానికి ట్రీట్‌మెంట్ ప్లాంట్ వున్నప్పటికీ, ఖర్చులను ఆదా చేయడానికి వ్యర్థాలను శుద్ధి చేయకుండానే సముద్రంలోకి విడిచిపెడుతున్నారని వారు ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోకపోవడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లి, తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

29న జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు

చీడికాడ, సెప్టెంబరు 27 : మండలంలోని దిబ్బపాలెంలో ఈనెల 29న జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎస్.రమణబాబు తెలిపారు. శ్రీసిద్ధి వినాయక నిమజ్జనంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు క్విజ్‌పోటీలు, 10 గంటలకు ముగ్గుల పోటీలు, 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు జరుగుతాయన్నారు. రేలారేరేలా కార్యక్రమంతోపాటు సాయంత్రం 6 గంటలకు ఉత్తరాపల్లి బృందంతో బిందెల డ్యాన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

పీతపాలెం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాలు, పీలా గోవింద

కొత్తూరు, సెప్టెంబరు 27 : అనకాపల్లి మండలంలోని కోడూరు నుంచి పీతపాలెం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మించనున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పాక్కగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డీవో చిన్నికృష్ణ, పంచాయతీ రాజ్ ఈఈ వీరం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కొణతాల

తుమ్మపాల : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోడూరులో పర్యటించారు. గత వంద రోజుల కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న చిట్టిబాబు, నగేష్

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 27 : మండలంలోని ఎస్.నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-ఆర్డినేటర్ టి.రవికుమార్ మాట్లాడుతూ రెండ్రోజులపాటు నిర్వహించే కబడీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, చెస్, యోగ, అథలెటిక్స్ పోటీల్లో నాలుగు మండలాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ పల్లెల స్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ మాసా ఈశ్వరరావు, వైస్ చైర్మన్ బి.అమరావతి, హెచ్ఎం ఎం.ఝాన్సీతో పాటు కూటమి నాయకులు గొర్రెల రాజబాబు, బొంది కాశీవిశ్వనాథం, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, చించలపు ప్రదీప్, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై విద్యార్థులకు వివిధ పోటీలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 27 : మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం స్వర్ణాంధ్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 సత్తిబాబు ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర సాధనకు రానున్న ఐదు సంవత్సరాల్లో విద్యారంగంలో తీసుకోవాల్సిన సంస్కరణలు' అంశంపై వ్యాస రచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు జరిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన తుమ్మలపల్లి శ్రావణి, తన్నీరు హేమలత, కోనా దుర్గశ్రీలను అనకాపల్లిలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారని పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్, నాయుడు, చక్రవర్తి, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వకృత్వ, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన సీసీడీవో జి.భాను బంగారులక్ష్మి ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మాధవ్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

గతుకుల రోడ్డులో ఊడిన బస్సు టైర్లు

... 5వ పేజీ తరువాయి

సమయంలో మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామ సమీపానికి చేరుకుంది. అక్కడ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యి వర్షం నీటితో నిండి ఉంది. గొయ్యిలో నుంచి బస్సు వెళుతున్న క్రమంలో ఎడమ వైపు వెనుక ఉన్న రెండు టైర్లు ఊడిపోయాయి. ఒక్కటి అక్కడే పడిపోగా, మరొకటి కొంచెం దూరంలో పడింది. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి బస్సు ఎడమ వైపునకు వాలింది. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు హడలిపోయారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రమాదం జరగకుండా బస్సు వేగాన్ని నియంత్రించి నిలుపుదల చేశారు. గొయ్యి నుంచి సుమారు 15 మీటర్ల దూరం వెళ్లిన తరువాత బస్సు ఆగింది. చక్రాలు ఊడిన సమయంలో బస్సులో 16 మంది ప్రయాణికులు వున్నారు. కొద్దిసేపటి తరువాత మాడుగుల వెళ్లే మరో బస్సు రావడంతో ప్రయాణికులను దానిలో ఎక్కించి పంపించారు.



అచ్యుతాపురంలో బురదమయమైన మోసయ్యపేట సంత



రాంబిల్లి సమీపంలో నేవీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఎలమంచిలిలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

తెరిపివ్వని వాన

▸ దఫదఫాలుగా కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం ▸ అవస్థలు పడిన జనం



అచ్యుతాపురం మండలం పూడిమడకలో జాలారిపాలెం - సముద్ర తీరం మధ్య నిలిచిన వర్షపు నీరు

అచ్యుతాపురం సెప్టెంబరు 27 : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అచ్యుతాపురం మండలంలో గురువారం రాత్రి నుంచి అడపా దడపా వర్షం పడుతూనే ఉంది. శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పూడిమడక సముద్ర తీరంలో భారీగా నీరు చేరింది. సాధారణంగా అలల ఉధృత పెరిగితే సముద్రపు నీరు గ్రామానికి దగ్గరగా వస్తుంది. కానీ ఈసారి అలల నీరు తీరంలో ఉన్న పడవల వరకు కూడా రాలేదు. కానీ జాలారిపాలెం వద్ద తీరంలో భారీగా వర్షపు నీరు చేరింది. సాయంత్రం వరకు అడపా దడపా భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగే సంత బోసిపోయింది. వేకువజాము ఐదు గంటల నుంచే రైతులు తాము పండించే కూరగాయలను సంతకు తెచ్చేవారు. కానీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల వరకు రైతులు సంతకు తేలేదు. వర్షానికి సంత ఆవరణ అంతా బురద మయం కావడంతో వచ్చిన కొద్దిపాటి రైతులతో పాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎలమంచిలి : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శుక్రవారం ఉదయం నుంచి చెదురు మదురుగా వర్షాలు కురిశాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద అపారిశుధ్యం నెలకొంది. తాజా వర్షాలకు ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య సిబ్బంది వెంటనే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రాంబిల్లి : తుఫాన్ కారణంగా మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ కారణంగా కొత్తూరు వద్ద మైనర్, మామిడివాడ వద్ద మేజర్ శారదా నదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల ప్రధాన రోడ్లు, సీసీ రోడ్లు జలమయమయ్యాయి. రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్లే నేవీ రోడ్డుపైనుంచి నీరు ప్రవహించిది. ఈ రోడ్డుతో పాటు సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు, రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షాలు పడినప్పుడల్లా చేపల వేటకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెం, వెంకయ్యపాలెం మత్స్యకారులు వాపోయారు.

పాయకరావుపేట : మండలంలో గురువారం రాత్రి చినుకులతో ప్రారంభమైన వర్షం తెల్లవార్లూ అడపాదడపా పడుతూనే ఉంది. శుక్రవారం ఉదయం నుంచి కూడా అదే వాతావరణం కొనసాగడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో శుక్రవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చినుకులతో ప్రారంభమైన కొద్దిసేపటికి కుండపోతగా పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో 42.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

అనకాపల్లి టౌన్ : వర్షాలు కురిస్తే అనకాపల్లిలో పీటీడీ కాంప్లెక్స్, విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి, సత్యనారాయణపురం శివారు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సదరు బృందం శుక్రవారం పీటీడీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపునీటిని పరిశీలించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారడంతో వర్షాలు కురిస్తే ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కాళ్ల తేలయ్యబాబు, దాకారపు శ్రీనివాసరావు, పలకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోగా ఏలేరు ఎడమ కాలువ నుంచి నియోజకవర్గంలోకి నీరు

▸ అచ్యుతాపురం మండల సమావేశంలో ఎమ్మెల్యే 'సుందరపు' వెల్లడి ▸ సమస్యలను వివరించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 27 : పారిశ్రామిక ప్రాంతంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురాన్ని అన్నింటా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. వచ్చే ఏడాది జూన్‌లోగా ఏలేరు ఎడమ కాలువ నుంచి ఎలమంచిలి నియోజకవర్గంలోకి నీరు రప్పించే ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ఇక్కడ రోడ్ల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి గ్రామాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, తాగునీటి వనరుల అభివృద్ధి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలను వివరించారు. రామన్నపాలెంలో డ్రైనేజీ, పారిశుధ్యం, కల్వర్టుల నిర్మాణ చేపట్టాలని సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడు (డ్రీమ్స్ నాయుడు) కోరారు. దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరావు మాట్లాడుతూ గ్రామంలో గల వాటర్ ట్యాంకు మెట్లకు మరమ్మతులు చేయించాలన్నారు. మల్లవరం సర్పంచ్ పిన్నమరాజువాసు గ్రామ అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలన్నారు. మడుతూరులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ మోటూరు సంజీవి కోరారు. మరికొంత మంది సభ్యులు ఆయా పంచాయతీల్లో సమస్యలను వినిపించారు. వీటిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. జడ్పీటీసీ లాలం రాము, ఎంపీడీవో ప్రభాకరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల పాల్గొన్నారు.

ఎలమంచిలి ఎంపీడీవోగా కొండలరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 27 : ఇక్కడి ఎంపీడీవోగా కె.ఎస్. కొండలరావు శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. రాంబిల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న అప్పలనాయుడు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

నక్కపల్లి, సెప్టెంబరు 27 : ఇక్కడి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వేంపాడు హైవే టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ప్రాజెక్ట్ మేనేజర్ నాగేశ్వరరావు, ఏజీఎం శ్రీనివాస్, సేఫ్టీ మేనేజర్ అశోక్ రాహుల్, టోల్‌ప్లాజా మేనేజర్ కృష్ణ , ఐఎంటీ మేనేజర్ సత్యనారాయణ, పవన్‌కుమార్, ప్రేమ్, సత్తిరాజు పాల్గొన్నారు.

అణుకు ఎన్ఆర్ఎస్‌టీసీ సందర్శించిన అధికారులు

కోటవురట్ల, సెప్టెంబరు 27 : గొట్టివాడ పంచాయతీ శివారు అణుకు గిరిజన గ్రామంలో గల నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌ను శుక్రవారం సర్వశిక్షా అభియాన్ ఏఎల్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్. గిరిధర్, సీఎంవో శకుంతల, ఎంఈవో రామారావు తనిఖీచేశారు. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జి.హరీష్‌బాబు ద్వారా విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు.

'త్వరలో అనకాపల్లిలో ఏపీఆర్ఎస్ఏ భవనం'



సుధాకర్ ప్రసాద్ చిత్రపటం వద్ద అసోసియేషన్ ప్రతినిధులు నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 : ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడుగా తోట సుధాకర్ ప్రసాద్ ఉద్యోగులకు చేసిన సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుధాకర్ ప్రసాద్ 23వ వర్ధంతి సందర్భంగా ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రత్నం, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అందించిన సేవలను కీర్తించారు. త్వరలోనే అనకాపల్లిలో అసోసియేషన్ భవనం నిర్మించి, అందులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి వై.శ్రీరామ్మూర్తి, కోశాధికారి ఎస్.వరహాలు, అనకాపల్లి ఎన్నికల డీటీ విజయలక్ష్మి, ఆర్ఐ రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ఎలమంచిలి, సెప్టెంబరు 27 : మునిసిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన మునిసిపల్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. మునిసిపాలిటీలో బకాయి పడిన అలవెన్సులు, సబ్బులు, నూనె, వర్షా కాలంలో వాడేందుకు కోట్లు, షూలు కార్మికులకు ఇవ్వాలని కోరారు. అనంతరం వీటిపై కమిషనర్ ప్రసాదరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ ప్రతినిధులు వైనూకరాజు, సీహెచ్. వెంకటరమణ, వై.నాగరాజు, ఇ.చంద్రరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైల్వే జోన్ ఖాయం : బుద్ద

తుమ్మపాల, సెప్టెంబరు 27 : కూటమి ప్రభుత్వ పాలనలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు ఖాయమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వేశాఖ స్థాయి సంఘం చైర్మన్‌గా ఎంపీ సీఎం రమేష్ నియమితులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అనకాపల్లి స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన 'ప్రగడ'



చంద్రబాబుతో ప్రగడ

ఎలమంచిలి/అచ్యుతాపురం, సెప్టెంబరు 27 : ముఖ్యమంత్రి చంద్రబాబును ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలో కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఇక్కడి విలేకరులకు తెలిపారు.

కస్పావీధిలో అన్నసమారాధన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 : కస్పావీధిలో లక్ష్మీగణపతి వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు శుక్రవారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కోటిపల్లి జేజిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి శ్రీను, రీసు ఆచారి, బి.రవి, భీశెట్టి సౌజన్య, పెదపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వమ్మవరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



రికార్డులు తనిఖీచేస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 27 : పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధి వమ్మవరం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీచేసింది. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీసి, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ లూసి కార్డిలియా, జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, జగదీష్, దినేష్, శ్రీనివాస్, హెచ్ఎస్ ఆదినారాయణమూర్తి, షేక్ అమీర్‌షాజిద్, దేవరాజు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బీఎస్ గుప్తా అన్నారు. కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన కుట్టు శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, కోశాధికారి గ్రంధి సత్యేంద్ర పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



ఉపమాక దుర్గా భవానీ ఆలయం వద్ద ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

నక్కపల్లి, సెప్టెంబరు 27 : శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలుచోట్ల శుక్రవారం రాటోత్సవాన్ని జరిపారు. నక్కపల్లి మండలంలోని ఉపమాక దుర్గాభవానీ ఆలయంలో అర్చకులు మహేశ్ తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించి ముహూర్తపు రాట వేశారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ అక్టోబరు మూడవ తేదీ నుంచి పన్నెండవ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుపుతామన్నారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, లచ్చబాబు, తోలేటి శ్రీను, జోగయ్య, గురుభవానీలు రమణ, సత్తిబాబులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడలో బొంకుల దిబ్బయాత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించి శుక్రవారం పందిరి రాటను వేశారు. వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, పైలా రామచంద్రరావు, బొంకుల దిబ్బయాత్ అసోసియేషన్ ప్రతినిధులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైలా హరీష్, పైలా పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపులో జగనన్న కాలనీలు

... 5వ పేజీ తరువాయి

లేదు. దీనికితోడు వీధుల్లో డ్రైనేజీ కాలువలు నిర్మించలేదు. ఫలితంగా వాడుక నీటితోపాటు వర్షం నీరు కూడా బయటకు పోయే మార్గం లేక కాలనీలోనే వుండి పోతున్నది. నాడు రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా, ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు తమపై ఒత్తిడి చేశారని, ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని అంటున్నారు.

పెరిగిన పీజీ ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

భర్తీ కావాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నత విద్యాశాఖ ఈ నెల 13న రెండో దశ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 23 నుంచి 25 మధ్య వెబ్ ఆప్షన్స్ ఇచ్చారు. 26న వెబ్ ఆప్షన్స్ మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శనివారం విద్యార్థులకు సీట్లు అలాట్ చేయనున్నారు. రెండో దశలో కనీసం 15 నుంచి 20 శాతం మేర సీట్లు భర్తీ అయినా చాలని కాలేజీలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తుందన్న ఆశతో విద్యార్థులు ఉన్నారు. ఆ ఉద్దేశంతోనే చాలామంది మళ్లీ పీజీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

చైర్మన్‌గా సీఎం రమేశ్

... 5వ పేజీ తరువాయి

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా, ఫైనాన్స్ కమిటీ సభ్యునిగా తనకు అవకాశం కల్పించడం, రాష్ట్రానికి మరింత ప్రాధాన్యం ఇచ్చినట్టయ్యిందని సీఎం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, మంత్రులు అమిత్‌షా, జేపీ లడ్డాకు సీఎం రమేశ్ ధన్యవాదాలు తెలిపారు.

ఇసుక కొరత!

... 5వ పేజీ తరువాయి

కొంతమంది స్థానిక పెద్దలు అనధికారికంగా వేలంపాట నిర్వహించినట్టు తెలిసింది. చోడవరం మండలం గజపతినగరం, కె.కోటపాడు మండలం చౌడువాడల్లో ఇసుక డంపింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి, ఎలమంచిలి మండలం ఏటికొప్పాకల వద్ద వరహా నదిలో అనధికారికంగా ఇసుక తోడేస్తున్నారు. దార్లపూడిలో టైరు బండి ఇసుక రూ.1200 నుంచి రూ.1400లకు అమ్ముతున్నారు.

ఎంవీఆర్ ఉచిత తీర్థ యాత్ర బస్సు ప్రారంభం



తీర్థ యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 : ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత తీర్థ యాత్ర బస్సు శుక్రవారం బయల్దేరింది. నరసింగరావుపేటలోని ఎంవీఆర్ కార్యా లయం నుంచి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఈ యాత్రను ప్రారంభించారు. చోడవరం నియోజకవర్గం కొత్తకోట గ్రామానికి చెందిన భక్తులు ఈ బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు ఎంవీఆర్‌ను ఘనంగా సత్కరించారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు సత్కారం



బదిలీపై వెళుతున్న అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

సబ్బవరం, సెప్టెంబరు 27 : బదిలీపై సబ్బవరం మండలానికి విచ్చేసిన పలువురు అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. అప్పారావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి కె.శివ రామప్రసాద్, మండల సర్వేయర్ ఎల్ .అప్పారావు, జూనియర్ అసిస్టెంట్ హరీష్ విధుల్లో చేరారు. కాగా, ఇక్కడి నుంచి బదిలీపై వివిధ మండలాలకు వెళ్లిన ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట అప్పారావు, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, టైపిస్టు వినయ్‌కుమార్‌తో పాటు ఆరుగురు గ్రామ సర్వేయర్లను ఆర్ఐ వీరయ్య ఇతర అధికారులు ఘనంగా సత్కరించారు. వారి సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాసు, వీఆర్వోలు పూడి శేషు, రుక్మిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం'



నాయుడుపాలెంలో సామూహిక సీమంతాల్లో సీడీపీవో తదితరులు

పరవాడ, సెప్టెంబరు 27 : పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా నాయుడుపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి, సీతారామయ్య, మధు, కార్యదర్శి నగిరెడ్డి రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార వారోత్సవాల్లో భాగంగా చినదొడ్డిగల్లులో పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ముఖ్య అతిథులుగా హాజరై పౌష్టికాహారం గురించి వివరించారు. పీవో శ్రీవిద్య, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, మాజీ సర్పంచ్ వెలగా శ్రీను, నాయుడు నానాజీ, వెలగా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు ప్రయాణికుల సన్మానం

›› రాజేశ్వరరావుకు దక్కిన అపూర్వ గౌరవం



కండక్టర్ రాజేశ్వరరావును సన్మానిస్తున్న ప్రయాణికులు

దేవరాపల్లి, సెప్టెంబరు 27 : అంకితభావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది. ఇందుకు చక్కని ఉదాహరణ.. బస్సు కండక్టర్ సీహెచ్ రాజేశ్వరరావు. ఈయన ఆర్టీసీ కండక్టర్ విశాఖపట్నం-దేవరాపల్లి (12డి) సర్వీసులో ఇన్నాళ్లూ విధులు నిర్వహించారు. ఈ నెలాఖరుతో పదవీ విరమణ చేయనున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రయాణికులు రాజేశ్వరరావు సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనను శుక్రవారం గొప్పగా సన్మానించారు. ఈ రూట్లో ఓ చోట బస్సును ఐదు నిమిషాలు ఆపి, ఆ బస్సు ఎదురుగా కూర్చోబెట్టి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు సన్మానించి పులకించిపోయారు. పలువురు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు మాట్లాడుతూ రాజేశ్వరరావును కేవలం ఆర్టీసీ కండక్టర్‌గానే చూడలేమని, తమ కుటుంబ సభ్యుల్లో ఒకడిలా మెలిగేవారని చెప్పారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని మహిళా, పురుష ప్రయాణికులు వేర్వేరుగా నిర్వహించి రాజేశ్వరరావు పట్ల తమ అభిమానాన్ని చాటు కోవడం విశేషం. తన పట్ల ప్రయాణికులు చూపిన ఆదరాభిమానాలు అపూర్వమని, ఇది తన జీవితంలో మరుపురాని ఘట్టమని రాజేశ్వరరావు ఆనందపారవశ్యమయ్యారు. ఒక ఆర్టీసీ కండక్టర్‌ను ఈ విధంగా సత్కరించడం ప్రథమమని, ఇది రాజేశ్వరరావుకు దక్కిన గౌరవమని పలువురు పేర్కొన్నారు.

తాతయ్యబాబుకు అభినందనల వెల్లువ



తాతయ్యబాబును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 27 : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబుకు అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. చోడవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సమర్థవంతంగా పనిచేసిన తాతయ్యబాబును చైర్మన్‌గా నియమితులవడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వడ్డాది పార్టీ కార్యాలయంలో తాతయ్యబాబుకు నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ నేతలు శాలువాలు కప్పి అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చోడవరం, సెప్టెంబరు 27 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎస్ఎస్ యూనిట్లు, విశ్వనాథ్ టైప్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఇందులో 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. శిబిరంలో న్యూలైఫ్ బ్లడ్‌బ్యాంకు సహకారం అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నప్రభ, పిచ్చమ్మ, విశ్వనాథ్ టైప్ ఇనిస్టిట్యూట్ బాబ్జీ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు కేజీబీవీ విద్యార్థి



బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 27 : రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల విభాగం టెన్నీకాయిట్ పోటీలకు వడ్డాది కేజీబీవీ విద్యార్థి నిశ్విక ఎంపికైంది. గురువారం పరవాడ జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో నిశ్విక ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. అక్టోబరు మొదటివారంలో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో నిశ్విని పాల్గొననున్నట్టు అన్నపూర్ణ తెలిపారు. నిశ్విన్‌ను అన్నపూర్ణతో పాటు టీచర్లు అభినందించారు.

నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాటలో పాల్గొన్న సర్పంచ్ కళావతి, నిర్వాహక కమిటీ ప్రతినిధులు

మాడుగుల, సెప్టెంబరు 27 : మండల కేంద్రంలో దసరా ఉత్సవ నిర్వహణ కోసం శుక్రవారం పందిరిరాట వేశారు. వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకూ దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ పరిసరాలను సుందర విద్యుదీకరణతో నింపారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, దేవి ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, అధ్యక్షుడు వెంకట కొండలరావు, ఉపాధ్యక్షుడు సతీష్, కార్యదర్శి ఇళ్లపు రమణ పాల్గొన్నారు.

ఉపాధి ఏపీవోగా గంగునాయుడు



చీడికాడ, సెప్టెంబరు 27 : ఉపాధి పథకం చీడికాడ ఏపీవోగా అల్లు గంగునాయుడు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కోటవురట్ల మండలంలో పనిచేస్తూ ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

క్రీడలతో మానసికోల్లాసం

›› మాడుగుల ఎమ్మెల్యే బండారు
›› ఘనంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కె.కోటపాడు, సెప్టెంబరు 27 : ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, దీని వల్ల శారీరక, మానసిక సామర్థ్యాలు పెంపొందించుకునే అవకాశం ఉంటుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, స్థానిక సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, రొంగలి మహేష్, జూరెడ్డి రాము పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రేవతమ్మ, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్



కె.కోటపాడు : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

నర్సీపట్నంలో..

నర్సీపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూలులో శుక్రవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, సీఐ రేవతమ్మ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా క్రీడా, జాతీయ పతాకాలను రాజేశ్ ఆవిష్కరించారు. సీఐ రేవతమ్మ, రాజేశ్ షటిల్ ఆడి పోటీలను ఆరంభించారు. బాలుర విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, షటిల్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు రాజేశ్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, నియోజకవర్గ క్రీడా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, పీడీలు పాల్గొన్నారు.

మళ్లీ అక్కడే!

›› కొత్తకోటలో బీఎన్ రోడ్డుపై భారీ గోతులు
›› కూరుకుపోయిన సరుగుడు కర్రల లారీ
›› మూడు గంటలపాటు శ్రమించి బయటకు తీయాల్సిన పరిస్థితి
›› నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

రావికమతం, సెప్టెంబరు 27 : అడుగడుగునా భారీ గోతులతో నిండిన భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో రోజుకో చోట సరకు రవాణా వాహనాలు కూరుకుపోవడం పరిపాటిగా మారింది. మండలంలోని కొత్తకోట హైస్కూల్, ఆశమ్మ బడి వద్ద గోతుల్లో ఆదివారం సాయంత్రం లారీ కూరుకుపోగా, సోమవారం బొలెరో వ్యాన్ దిగబడిపోయిన విషయం తెలిసిందే. వీటిని బయటకు తీయడానికి మనుషులతో కుస్తీ పట్టినా ప్రయోజనం లేకపోవడంతో ట్రాక్టర్‌ను రప్పించి, తాళ్లతో బయటకు లాగాల్సి వచ్చింది. తాజాగా టి.అర్జాపురం నుంచి రాజమహేంద్రవరానికి సరుగుడు కర్రల లోడుతో వెళ్తున్న లారీ కొత్తకోట హైస్కూల్ వద్దనే భారీ గొయ్యిలో కూరుకుపోయింది. దీనిని బయటకు తీసేందుకు క్రేన్‌ను రప్పించి ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోవడంతో ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చి, రెండింటి సాయంతో లారీని గోతిలో నుంచి గట్టెక్కించాల్సి వచ్చింది. సుమారు మూడు గంటల తరువాత సరుగుడు కర్ర లారీని బయటకు తీశారు. అప్పటి వరకు ఇరువైపులా ఆర్టీసీ బస్సులు, లారీలు ఆగిపోయాయి.



కొత్తకోట హైస్కూల్ వద్ద గోతిలో కూరుకు పోయిన సరుగుడు కర్రల లారీ



భారీ క్రేన్‌తో లారీని బయటకు తీస్తున్న దృశ్యం

ఏఎల్ పురంలో క్షుద్రపూజల కలకలం

జడ్పీహెచ్ఎస్ ఆవరణలో పూజలు చేసిన ఆనవాళ్లు



సభా వేదిక వద్ద వేసిన ముగ్గు, పడి ఉన్న వస్తువులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 27 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జడ్పీహైస్కూల్‌లో క్షుద్ర పూజలు జరిగాయంటూ ప్రచారం జరగడంతో కలకలం రేగింది. శుక్రవారం ఉదయం కొందరు స్కూలు ఆవరణలో క్షుద్ర పూజలు జరిగాయంటూ చెప్పారు. దీంతో అక్కడకు పలువురు గ్రామస్థులు వెళ్లి చూడగా, సభా వేదిక వద్ద ముగ్గు వేసి ఉంది. ఎవరో పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి.ఆ పరిసరాల్లో ముగ్గుతో పాటు దానిపై పెట్టిన నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, చితక కొట్టిన కోడిగుడ్లు తొక్కలు ఉన్నాయి. పోలీసులు కూడా వచ్చి పరిశీలించారు. ఎవరో ఇక్కడ క్షుద్రపూజలు చేశారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం స్కూలుకు తొలుత వచ్చిన విద్యార్థులు అక్కడ వాతావరణం చూసి భయంతో ఇంటికి వెనుదిరిగి వెళ్లిపోయారు. అనంతరం స్థానిక హెచ్ఎం నాగభూషణం, స్కూలు విద్యా కమిటీ చైర్మన్ లగుడు రాజులు నాయుడు, ఇతర ఉపాధ్యాయులు వచ్చి విద్యార్థులకు నచ్చచెప్పి స్కూలుకు రప్పించారు. హైస్కూల్‌లో వాచ్‌మన్ ఉన్నప్పటికీ ఆయన అర్ధరాత్రి ఇంటికి వెళ్లిన సమయంలో ఎవరో ఇలా పూజలు చేసి ఉంటారని స్థానికులు, తల్లిదండ్రులు అంటున్నారు. ఇలాంటివి జరగకుండా చూడాలని కోరుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట, సెప్టెంబరు 27 : ఉపాధి హామీ నిధులను పారదర్శకంగా వినియోగించడంతో పాటు కూలీల హక్కుల రక్షణకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏపీడీ రోజారాణి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక శ్రీశక్తి భవనంలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1117 పనులకు సంబంధించి రూ.17.40 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో మస్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు.

ఎంకే పట్నం, కొండపాలెం ఫీల్డ్ అసిస్టెంట్లు దేముడు, రమణపై కొందరు ఫిర్యాదులు చేశారు. వీరిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్టు ఏపీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, విజిలెన్స్ విభాగం అధికారి దివ్య, ఎస్ఆర్పీ నాగరాజు, ఈవోపీఆర్డీ నూకరాజు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దుకాణాల్లో స్మార్ట్ మీటర్లు



రావికమతం, సెప్టెంబరు 27 : మండల కేంద్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను గురువారం నుంచిఅమర్చుతున్నారు. అయితే కొత్తగా స్మార్ట్ మీటర్లు అమర్చే సిబ్బంది వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేక పోవడంతో కొంత మంది దుకాణదారులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరాకరిస్తున్నారు. ఈ విషయమై ఈపీడీసీఎల్ ఏఈ నందన్‌ను అడగ్గా.. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కేటగిరి-2కు చెందిన మీటర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నట్టు చెప్పారు. దీనిపై విద్యుత్ వినియోగదారులు ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆయన తెలిపారు.

నర్సీపట్నంలో భారీ వర్షం

పొంగిన డ్రైనేజీలు
లోతట్టు ప్రాంతాలు జలమయం



శారదానగర్‌లో రోడ్డు మీద నిలిచిన వర్షం నీరు



శ్రీదుర్గామల్లేశ్వర స్వామి గుడి వద్ద పొంగిన డ్రైనేజీ

నర్సీపట్నం, సెప్టెంబరు 27 : నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మెయిన్ రోడ్డులో శివపురం, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి గుడి వద్ద, శారదానగర్‌లోని మంగీలాల్ స్వీట్స్ వద్ద డ్రైనేజీలోని నీరు రోడ్డు మీద పారింది. మునిసిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 22వ వార్డులోని ఎంపీపీ స్కూలు రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయి రాకపోకలకు అవాంతరం ఏర్పడింది.

మాజీ మంత్రి బలిరెడ్డి వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న నేతలు

చోడవరం, సెప్టెంబరు 27 : పట్టణ శివారు పీఎస్ పేటలో శనివారం మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు ఆరవ వర్ధంతిని నిర్వహించారు. బలిరెడ్డి సత్యారావు స్వగ్రామమైన పీ ఎస్‌పేటలో ఏర్పాటు చేసిన బలిరెడ్డి విగ్రహం వద్ద బలిరెడ్డి కుటుంబీకులతో పాటు, పలువురు వైసీపీ నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, దన్నిన వెంకటరావు, వెంపలి ఆనంద్, సేనాపతి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో ఇరుక్కున్న గేదె

డ్రిల్లింగ్ మిషన్‌తో డ్రైనేజీ తొలగించి కాపాడిన గ్రామస్థులు

రావికమతం, సెప్టెంబరు 27 : ప్రమాదవశాత్తూ ఓ సూడి గేదె కాలువలో పడి ఇరుక్కుపోయింది. చివరకు గ్రామస్థుల చొరవతో ప్రాణాపాయం తప్పి బయటపడింది. రావికమతం గ్రామానికి చెందిన రైతు ముచ్చకర్ల పేరినాయుడు శుక్రవారం గ్రామ శివారులో శ్మశాన వాటిక సమీపంలో పశు గ్రాసం కోసం గేదెలను తోలుకెళ్లాడు. ఓ గేదె పశుగ్రాసం మేస్తూ తుప్పలు, గడ్డితో నిండి ఉన్న డ్రైనేజీలో పడి పోయింది. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేకపోయింది. కొందరు రైతులు గమనించి కాలువను డ్రిల్లింగ్ మిషన్‌తో తొలగించారు.దీంతో 'బతుకుజీవు డా..' అంటూ ఆ గేదె ప్రాణాలతో బయట పడింది.



కాలువలో ఇరుక్కున్న గేదె

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేశ్

... 5వ పేజీ తరువాయి

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా, ఫైనాన్స్ కమిటీ సభ్యునిగా తనకు అవకాశం కల్పించడం, రాష్ట్రానికి మరింత ప్రాధాన్యం ఇచ్చినట్టయ్యిందని సీఎం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, మంత్రులు అమిత్‌షా, జేపీ లడ్డాకు సీఎం రమేశ్ ధన్యవాదాలు తెలిపారు.

పెరిగిన పీజీ ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

భర్తీ కావాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నత విద్యాశాఖ ఈ నెల 13న రెండో దశ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 23 నుంచి 25 మధ్య వెబ్ ఆప్షన్స్ ఇచ్చారు. 26న వెబ్ ఆప్షన్స్ మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శనివారంవిద్యార్థులకు సీట్లు అలాట్ చేయనున్నారు. రెండో దశలో కనీసం 15 నుంచి 20 శాతం మేర సీట్లు భర్తీ అయినా చాలని కాలేజీలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తుందన్న ఆశతో విద్యార్థులు ఉన్నారు. ఆ ఉద్దేశంతోనే చాలామంది మళ్లీ పీజీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఇసుక కొరత!

... 5వ పేజీ తరువాయి

కొంతమంది స్థానిక పెద్దలు అనధికారికంగా వేలంపాట నిర్వహించినట్టు తెలిసింది. చోడవరం మండలం గజపతినగరం, కె.కోటపాడు మండలం చౌడువాడల్లో ఇసుక డంపింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి, ఎలమంచిలి మండలం ఏటికొప్పాక వద్ద వరహా నదిలో అనధికారికంగా ఇసుక తోడేస్తున్నారు. దార్లపూడిలో టైరు బండి ఇసుక రూ.1200 నుంచి రూ.1400లకు అమ్ముతున్నారు.

గతుకుల రోడ్డులో ఊడిన బస్సు టైర్లు

... 5వ పేజీ తరువాయి

సమయంలో మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామ సమీపానికి చేరుకుంది. అక్కడ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యి వర్షం నీటితో నిండి ఉంది. గొయ్యిలో నుంచి బస్సు వెళుతున్న క్రమంలో ఎడమ వైపు వెనుక ఉన్న రెండు టైర్లు ఊడిపోయాయి. ఒక్కటి అక్కడే పడిపోగా, మరొకటి కొంచెం దూరంలో పడింది. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి బస్సు ఎడమ వైపునకు వాలింది. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు హడలిపోయారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రమాదం జరగకుండా బస్సు వేగాన్ని నియంత్రించి నిలుపుదల చేశారు. గొయ్యి నుంచి సుమారు 15 మీటర్ల దూరం వెళ్లిన తరువాత బస్సు ఆగింది. చక్రాలు ఊడిన సమయంలో బస్సులో 16 మంది ప్రయాణికులు వున్నారు. కొద్దిసేపటి తరువాత మాడుగుల వెళ్లే మరో బస్సు రావడంతో ప్రయాణికులను దానిలో ఎక్కించి పంపించారు.

ముంపులో జగనన్న కాలనీలు

... 5వ పేజీ తరువాయి

లేదు. దీనికితోడు వీధుల్లో డ్రైనేజీ కాలువలు నిర్మించలేదు. ఫలితంగా వాడుక నీటితోపాటు వర్షం నీరు కూడా బయటకు పోయే మార్గం లేక కాలనీలోనే వుండిపోతున్నది. నాడు రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా, ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు తమపై ఒత్తిడి చేశారని, ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

☛ సంక్షిప్తంగా..

నర్సీపట్నం ఎంపీడీవోగా ఉషశ్రీ



ఎంపీడీవోకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 27 : నర్సీపట్నం ఎంపీడీవోగా కె.ఉషశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎన్.జయమాధవి రాంబిల్లి మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. నూతనఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉషశ్రీని స్థానిక కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతోఅభినందించారు.

తహసీల్దార్‌గా రమాదేవి



మోదకొండమ్మను దర్శించుకున్న తహసీల్దార్ రమాదేవి

మాడుగుల, సెప్టెంబరు 27 : మాడుగుల తహసీల్దార్‌గా కె.రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేసిన ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. అంతకుముందు మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొనేందుకు వెళ్లిన ఆమెకు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శ్రీనాద శ్రీనివాసరావు, ఢిల్లీ నానాజీ, పల్లెల రాములు స్వాగతం పలికారు. తహసీల్దార్ రమాదేవికి కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్ల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

దేవరాపల్లి తహసీల్దార్‌గా లక్ష్మీదేవి



దేవరాపల్లి, సెప్టెంబరు 27 : దేవరాపల్లి తహసీల్దార్‌గా పి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్‌గా అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీదేవి కలెక్టరేట్‌లో సూపరెండెంట్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా కె.అప్పారావు పాయకరావుపేట నుంచి ఇక్కడకు వచ్చారు. ఆయన గతంలో ఇక్కడ ఆర్ఐగా పని చేశారు.

నర్సీపట్నం తహసీల్దార్‌గా రామారావు



అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 27 : నర్సీపట్నం తహసీల్దార్‌గా ఎల్.రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను రెవెన్యూ సిబ్బంది మార్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఇప్పటి వరకూ పని చేసిన బి.రవికుమార్ సబ్బవరం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

బుచ్చెయ్యపేట తహసీల్దార్‌గా లక్ష్మి



బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 27 : బుచ్చెయ్యపేట తహసీల్దార్‌గా ఎం.లక్ష్మి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె దేవరాపల్లి నుంచి బదిలీపై ఒక్కడకు రాగా, ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసరావు గొలుగొండ తహసీల్దార్‌గా వెళ్లారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా మురళీధర్‌రావు, సీనియర్ అసిస్టెంట్‌గా వేంకటేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన లక్ష్మి, మురళీధరరావులను వీఆర్వోలు, సచివాలయాల అసిస్టెంట్ వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది అభినందించారు.

గొలుగొండ తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



గొలుగొండ, సెప్టెంబరు 27 : గొలుగొండ తహసీల్దార్‌గా పి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ప్రసాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అలాగే మండల సర్వేర్‌గా వి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


నాతవరం డీటీగా టీవీఎల్ రాజు



డీటీని కలిసిన నేతలు

నాతవరం, సెప్టెంబరు 27 : నాతవరం డిప్యూటీ తహసీల్దార్‌గా శుక్రవారం టీవీఎల్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ విశాఖపట్నం కలెక్టరేట్‌లో పని చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్ తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు తదితరులు టీడీని కలిసి అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సత్యనారాయణ



చీడికాడ, సెప్టెంబరు 27 : మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా వీవీఎస్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నక్కపల్లిలో టీడీగా పనిచేసిన ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీటీగా పని చేసిన పొట్నూరి రమేష్ కోటవురట్ల మండలానికి బదిలీపై వెళ్లారు.